ఈవారం కథ

# ఇరుకు

బద్వేలి రమేష్



వానబిడ్డని కడుపులో మోస్తూన్న నిండుమనిషి మాదిరిగా వున్నాయి ఆకాశంలో మోడాలు. ప్రసవించే సమయమింకా కాలేదేమో మరి, దిగలేదింకా వాన. దిగితే వానపాప స్పర్శతో నాగంపల్లి పులకించి పోవాల్సిందే.

కొండ నడుమ చీమంతపల్లి నాగంపల్లి. ఎప్పుడూ నిద్దర మొగంతో వున్నట్టే వుంటుంది. నిశ్శబ్దం పిడికిట్లో ఇమిడే వుంటుంది.

ఆ పల్లెవాళ్ళకి అగ్గిపెట్టె కావాలాన్నా, కాఫీ పొడి కావాలన్నా, పక్క పల్లెకి ఉరికెత్తాల్సిందే. ఇక ఆ తోవంతా ఎక్కీదిగే గుట్టలే. బండి చక్రం తిరగడమే పెద్ద బరువు. బస్సు గూర్చి అనుకోవడమిక అనవసరం. బడి కూడా ఇంకా పడని ఆ పల్లెకి కరెంటు ఈ నడుమే రాలేక రాలేక వచ్చింది.

ఇంటి నించి బైటకి రాగానే తిమ్మమ్మ ఆకాశాన్నీ క్రరి ఆవుల గుంపు మాదిరిగా వుండే మోడాల్నూ చూసి, 'అహహా' అని సంతోష పడింది. కండ్లల్లో ఆనందం వూగింది.

అంతుచిక్కని ఆకాశమూ, వజ్రాల కంచం మాదిరిగా వుండే సూర్యుడూ, మంచు తట్ట (కంచం) మాదిరిగా వుండే చందప్ప, మినుకు మినుకు తారలూ, మట్టితల్లీ, గాలీనీరూ, చెట్టూ చేమా, పుట్టా గుట్టా వీటితో స్నేహం పెళ్ళికి ముందు చాలా వుండేది, తిమ్మమ్మకి.

ఆ ఊరిలోని ఆదిరెడ్డి పెద్ద కూతురు తిమ్మమ్మ. మూడేళ్ళ కిందట అతను, తన అక్క (సిద్దక్క) కొడుకైన బొజ్జిరెడ్డి, తిమ్మమ్మనిచ్చి పెళ్ళి చేశాడు.

సిద్దక్కది సొట్ట బుద్ది. తన కూతురు సుఖ పడదని తిమ్మమ్మతల్లి ఆదిరెడ్డితో మొత్తుకొని చెప్పింది.

మొగుడు పోగానే, కొడుకుని చంక నెత్తుకొని, డబ్బు మూట పట్టుకొని వచ్చింది సిద్దక్క నాగంప ల్లికి. కొంతచేనూ, ఇల్లూ, ఆదుర్లకి కొనుక్కుంది.

మేనల్లుడు ఎదిగే వరకూ మంచీ చెడ్డ ఆదిరె డ్డిదే. అక్క బుద్ధి బురద గుంటయితే అల్లుడు తామరపూవనుకొని మంచి కట్న కానుకలతో తిమ్మమ్మనిచ్చి పెండ్లి చేశాడు.

పెళ్ళైనాక కొద్ది దినాలు సుఖపడిందేమోగాని తిమ్మమ్మ, తర్వాత ఆమె మొగంలోని వెలుగంతా అత్తా, మొగుడూ కలిసి మేసేశారు.

దోసిలంత చెండు పువ్వు మాదిరిగా వుండే తిమ్మమ్మ, ఇప్పుడు ఎండిన జొన్నదంటు మాదిరైంది.

పెండ్లయినాక, ఆకాశాన్ని చూసినా, ఎల్లేగొడ్ల బావిలోని (ఒకప్పుడు ఎలుగుబంట్లు అక్కడ నీళ్ళు తాగేవి) నీటిలో కదిలే చేపల్ని చూసినా తిమ్మమ్మ కన్నుల్లో కాంతి మెరవడం ఆగిపోయింది.

అయితే ఇన్నాళ్ళకి ఆమె మొగంలో కాంతి మళ్ళీ రావడానికి కారణం ఏమిటో సిద్దక్క తెల్సుకోలేకపోయింది.

''యాడికో యెల్లబారినావే! మొగుడింట్లో లాకుంటే ఇంగ మెరవణీ గావల్ల గద! మొన్న పోయి నాడు వాడు బెంగుళూరికి. కానని దేశంలో ఏమి అగచాట్లు పడతాండాడో! నీకు సీమంత చింత లేదు. తిరిగింది తిరిగిందే'' వక్కాకు నములుతా కటువు కంఠం పెట్టుకొని అంది సిద్దక్క.

''యాడికి పోతాండానూ, మా ఇంటికే గద.''

''ఇంగా అదే నీ యిల్లు! మరి ఆడేవుండు'' పొగాకు వేసికొంటూ అంది.

తిమ్మమ్మ కోపంగా చూసింది.

''మారెమ్మ మాదిరిగా గుడ్లురుముతాండావే, తింటావా? మీ నాయిన్ని అడిగి దుడ్లు కొండ్రా. నీ మొగునికి పని దొరికితే సుఖపడేది నేనా! నీవా! అయినా వానిమీద నీకు ఇలా లేదులే, ఆ ఇట్టమే వుంటే జవురుకొని రావా దుడ్లు'' అంది సిద్దక్క.

తిమ్మమ్మ చరచరా కదిలిపోయింది.

25-10-91 ఆంధ్రజ్యోతి వారపత్రిక

'లెక్కంట, లెక్క (డబ్బు) యాడ్నుంచి తీసుకొచ్చేది? అయినా ఎంత సాయం చేశాడు నాయన! వుండేది నాకు దోస్తే వాళ్ళెట్ల బతుకుతారు?...."

.....ఉద్దోగం చూస్కుంటావంటే పైమీది బంగారంతా తీసిస్తి. పనీ రాలా గినీ రాలా.

ఈయప్ప (బొజ్జిరెడ్డి) సదివింది ఇంటరు. మోపుగా సదివినోళ్ళే అంగలాస్తాన్నారు పని దొరకక! బారలు బారలు చేంతాడే బాయిలోని నీళ్ళు తేలాకుంటే, ఈయప్ప కేం దొరుకుతుంది!

'పనికోసం యెంపర్లాడేకి పోతానంటాడు, పోయింది పోయిందే. లెక్కంతా కర్చు పెట్టేది, ఉట్టి చేతుల్తో ఊగలాడతా వచ్చేది. దరిద్రం ముండాని నన్ని తిట్టేది.'

తిమ్మమ్మ కండ్లల్లో నీరూరింది.

** ** **

"ఒయకా యాడికి పోతాండావు?" తపెల తోముతా అడిగింది అలివేలు.

ఠక్కున ఆగింది తిమ్మమ్మ.

"ఈడికే వస్తాండా"

"మల్ల సక్కేగా చూడకుండా పోతాండావే!" తపెలని నీటితో కడుగుతా అంది అలివేలు.

మసిపోయిన తపెల తెల్లగా మెరుస్తోంది. తిమ్మమ్మ మాట్లాడలేదు.

"రాయకా లోగాకి. సద్దరొట్టె చేసినా, చెనిగిత్తనాలూ మాలేసి. నీ కోసం రెండు గట్టిగా చేసినా. నింజాటొంకాయ కూరా చేసినా" అని నోరారా పిలుస్తా లోపలికి వెళ్ళింది అలివేలు.

తిమ్మమ్మ ఇంట్లోకి వెళ్ళింది.

కడా చెల్లెలు భాగ్యమ్మ దూలానికి కట్టిన తాడు ఉయ్యాల్లో ఊగుతూంది.

పక్కింటి పాప కదిరెమ్మ ఊపుతాంటే భాగ్యమ్మ కిలకిల నవ్వుతా ఊగుతూంది.

పసితనంలోని తీపిదనం గుర్తొచ్చి తిమ్మమ్మ నిట్టూర్చింది. చెల్లెల్ను నిలబెట్టి చెంపల్ని ప్రేమగా పిండి,ముద్దు పెట్టుకొని ఉయ్యాల నూపి పసిదాని మాదిరిగా తనూ నవ్వింది.

అక్క నవ్వడం చూసి అలివేలు ఆశ్చర్యపోయింది. నవ్వీ నవ్వీ చివరగా దగ్గుతూ మిగిలిపోయింది తిమ్మమ్మ.

సద్ద రొట్టె, వంకాయ కూర తింటూ, రుచిగా చేసినావని అలివేల్ని పొగిడాక-

"ఓ... పా... అలీవేలీ! చెనిగిత్తనాల చెట్నీ వుందా?" అంది.

"ఉండాది గావల్ల. రాత్రి చేసింది."

ఆ ఇంట్లో అనమక్క చెనిగిత్తనాల చెట్నీ బ్రహ్మాండంగా చేస్తుంది. అది తప్ప ఇంకే వంటా ఓపికగా, రుచిగా చేయదామె. యెప్పుడూ చేనూ, తోట గురించే అనమక్క శ్రద్ధ.

అలివేలు చెట్నీ వేయగానే, దాన్ని రొట్టెలోకి అద్దుకొని, రవ్వంత రవ్వంత రొట్టెతో కలిపి తింటూంటే తిమ్మమ్మకి తల్లిని తాకి పోతూన్నట్లు అన్పించసాగింది.

ఆదిరెడ్డీ, అనమక్కా కదిరికి బట్టలు తేవడానికి పోయారు. అనమక్క తమ్ముని కూతురు పెండ్లికి బట్టలు కుట్టించాలని వెళ్ళారు.

రొట్టె తిన్నాక, తల్లిదండ్రులు సాయంత్రానికి గాని రారని చెల్లెలుతో అంది తిమ్మమ్మ.

"టైము నాలుగయింది. బస్సు నాల్గున్నరకల్లా వస్తుంది. ఆడ నుంచి (పక్క ఊరు) ఈడికి రావల్లంటే సాయంత్రమైతుంది. వానేమో వచ్చేట్లుందీ" అంది అలివేలు అన్నానికి ఎసరు పెడుతూ.

నిరుడు అలివేలు ఏడు పాసయింది. ఆ తరగతి వరకే పక్క ఊర్లో వుండేది. పై తరగతులు చదవాలంటే దూరంగా పోవాలి. దూరమంటే పదిహేను కిలోమీటర్లు! అక్కడ చేరడానికి వారికి అనుకూలమే లేదు.

గుమ్మడి మొగ్గ మాదిరిగా వుండే అలివేలును చూసి "దీనికీ పెండ్లయితే నాయాకట్లే అయిపోతాదా" తిమ్మమ్మ మనసు భయంతో కంపించింది. 'దీని రాతాఫలం ఎట్లుందో' అనుకొని, గోడకి తగలించిన తల్లిదండ్రుల ఫోటోను చూస్తా వుండిపోయింది.

'మనింట్లోకొచ్చి వుంటావంటే ఎట్ల కుదురుతాదే! ఆడే ఉండల్ల. మొగుడ్ని ఇడిచిపెట్టి ఈడుంటే ఏం మర్యాద!'

.........................

'కూలి చేసుకొని పడుంటావంటావా, బాగుంటాది సంబడం!'

.........................

'ఆ బేవర్సి నా కొడుకు (బొజ్జిరెడ్డి) ఇనడే. నీవే సర్దుకోవల్ల.'

పిల్లల అరుపులకి తిమ్మమ్మ ఆలోచనలు చెదిరిపోయాయి.

ఇంట్లోకి వచ్చారు బడికిపోయిన చంద్రకళ, రామిరెడ్డి.

"ఓకాయ్ వానొస్తాదని అయివారు ముందుగా పంపిచ్చె. బుక్కులు బడిలో పారెక్కి బిర్గ్గా వస్తిమి - వాన రాలా!"

వాళ్ళని చూసి, అలివేలుకి చెప్పి బైట పడింది తిమ్మమ్మ.

*    *    *    *

చల్లగాలి, చుట్టూరా కొండలు, తిరుపతి వెంకన్న చెంపల మాదిరిగా వుండే మోడాల్ను చూస్తూన్న తిమ్మమ్మ చెంపలూ కన్నీటితో తడిసిపోయాయి.

చినుకూ చినుకూ పద్దికగా రావడం మొదలైంది.

"బొజ్జిరెడ్డీ! నన్ను చూస్తే ముట్టుకోబుద్ది కాదంటివి. చినుకులు చూడు ఎట్ల నయ్యంతా ముట్టుకుంటుండాయో"- కిలకిల నవ్వింది.

'ఇది నానగువు! ఇన్నాళ్ళూ యాడ దాసిపెట్టు కొంటివే?'- పగలబడి నవ్వసాగింది తిమ్మమ్మ.

ఊరికి దూరంగా వుండే కొట్టంలోని వెంకమ్మ దగ్గరకి వెళ్ళింది తిమ్మమ్మ.

"రా పపా! చేను కాడి నుంచే వస్తాండావా?"

"ఊ నవ్వా" అబద్దం చెప్పింది తిమ్మమ్మ.

"మోపయితాంది వాన, లోగాకి రా"

వెంకమ్మ మలక మంచంపై కూచుంది. తనూ కూచుంటూ "అంతా యాడికి పోయినారు?" అంది తిమ్మమ్మ.

---

**సినిమా— సాహిత్యం**

సినిమా పుట్టుకతోనే వ్యాపారం. సాహిత్యం గత యిరవై ఏండ్లలో వర్తకంగా వికసించింది. సాహిత్యం వర్తకమైనప్పుడు జీవిత వాస్తవాన్ని చిత్రించదు. కృత్రిమ అనుభూతులనే సృష్టిస్తుంది. వాటికి మార్కెట్ లేకపోతే దాన్ని కూడా కృత్రిమంగా సృష్టిస్తుంది. గత యిరవై ఏండ్లలోనూ సాహిత్య వర్తకులయిన పత్రికా సంపాదకులు సాధించింది అదే. కథలకూ నవలలకూ ప్రైజులూ, పారితోషికాలూ కల్పించి విస్మరణ వాద సాహిత్యమే నిజమైన సాహిత్యమైనట్టు దేశ వ్యాప్తమైన భ్రమ కల్పించి దానికి విస్తృతమైన మార్కెట్ కల్పించడం. ఈ సాహిత్య వర్తకానికి రేడియో ఒక విధేయమైన పరిచారిక, సాహిత్య అకాడమీ ఒక విశ్వాస పాత్రమైన అంగ రక్షక దళం.

— రాచమల్లు రామచంద్రారెడ్డి, సేకరణ: ఈదుపల్లి

"కదిరికి"

వాన ఊపందుకొంది.

"ఈ యేడు వానకి బోలు బలమంట... అప్పులు బాద తట్టుకోలేక చేవంత అమ్మేసె అల్లుడు... ప్రాప్తి లేదు..." దిగులు పడింది వెంకమ్మ.

తిమ్మమ్మ నిట్టూర్చింది. వెంకమ్మ బొజ్జి రెడ్డి సంగతి ఎత్తుకోగానే తిమ్మమ్మ మనసు మేక మేయని ఆకంత చేదయిపోయింది.

కొంత సేపటికి – "నాకాడ యెన్నో పాటలు నేర్చుకొంటివి. లగ్నమైవంక అన్నీ మర్చిపో తివా?" అడిగింది వెంకమ్మ.

వెంకమ్మ పాట కోసమే తిమ్మమ్మ వచ్చింది.

"అవా! పాట పాడనా" చిన్న పిల్ల అడిగినట్టు అడిగింది.

వెంకమ్మ ముడతల మొగంలో మొలక నవ్వులు ఊరాయి.

"ఇన్నాళ్ళకి నా పాట గ్నెప్తికి వచ్చెనా, పసి" అవ్వ మొగంలో నవ్వు మరకలింకా మాయలేదు.

"వాన తగ్గేదంకా కూకో. పాటలు పాడుకొందామి" అంది అవ్వ.

వెంకమ్మ గొంతులో పాట పిలిస్తే వస్తుంది. ప్రతి దినమూ తెల్లవారే సమయాన నారాయణ శతకంలోని పద్యాలన్నీ కమ్మగా పాడుతూం టుంది. సాయంత్రమైతే తత్త్వాలు అందుకొం టుంది. బుద్ధి పుట్టినప్పుడంతా పాట పాడుతూనే వుంటుంది. శ్రోతలుండనీ వుండకపోనీ చెట్టుకో పుట్టకో విన్పిస్తున్నట్టు పాడుతుంది. ఒక్కోమారు కండ్లు మూసికొని తనకి తాను విన్పించుకొం టుంది.

అవ్వ దగ్గర తిమ్మమ్మ చాలా పాటలు నేర్చుకుంది. పెండ్లి కాక ముందు గొంతు మంచి తోసుకొని వచ్చేవి పాటలు. ఇప్పుడవి గొంతు లోనే పూడిపోయాయి.

"మూడు కాల్వలు దాట లేరన్నా ఇల మూఢ జనులూ..."తత్త్వం ఎత్తుకొంది వెంకమ్మ.

తగ్గు మొగం పడ్తూన్న వాన చిన్న సడిలో తత్త్వం దూసుకొని పోతూంది.

"పాము బట్ట నొస్తరేమన్నా సుగ్నానులారా" 'రా' అవ్వ గొంతులో పాము తిరిగినట్టు తిరుగుతూంటే తిమ్మమ్మకి కన్నీరు ఉబికి వచ్చింది.

"నడిమి కంటిలోన నారాయణదున్నాడు నాతులారా" అవ్వ కీర్తన మొదలు పెట్టగానే తిమ్మమ్మకి నరాలన్నీ జుమ్మని మోత పెట్టినట్లయింది.

"మడుగులో దీపము మరి వెలుగుచున్నది. మగువలారా" తిమ్మమ్మ గొంతులోకి పాట పొంగి వచ్చింది.

ఆ రెండు కంఠాలు వద్దికగా కల్సిపోయాయి.

"తమ్మదా తెలియుమ ధమ్యల కీతందు తరుణులారా కన్నతోడనెయిక అనుభవించరె కాంతలారా"

తిమ్మమ్మ కండ్లు దొనలయినాయి.

"పసి! మబ్బయింది పోమ్మా" అవ్వ అనగానే తిమ్మమ్మ కదిలింది.

ఒడ్డు మీద గిలిగిల లాడిన చేపకి తిరిగి నీటి ఇల్లు దొరకగానే అదెంత ఆనందంతో కదుల్తుందో! మరి ఒడ్డుకి చేరమంటే చేర్తుందా?

తిమ్మమ్మ ఇరుకు మనసులున్న మనుషుల మధ్య గిల గిల లాడింది. బైట పడాలంటే చేతకాక పోయె, చేతి ఆసరా లేకపోయె.

ఇంత వరకూ గడిపిన కాసంత సేపులో తిమ్మమ్మకి ఒకనాటి తన ప్రపంచంలోని తీపి తిరిగి అనుభూతికి వచ్చింది. ఆ ప్రపంచం నుంచి అత్తింటి ఇరుకులోకి వెళ్ళడం ఏమాత్రమూ ఇష్టం లేకపోయింది.

పక్క ఊరిలో దిగిన తిమ్మమ్మ తల్లిదండ్రులు వానవల్ల అక్కడే నిలిచిపోయారు.

"ఆడనే దూరుకొనెనా ఈముండా" తిట్టుకొంటూ వాకిలి వేసి పడుకొంది సిద్దక్క.

* * *

తెల్లవారే టప్పటికి వాన నిలిచిపోయింది.

చాలా సేపటికి తిమ్మమ్మ విషయం తెలిసింది. ఎల్లెగొడ్ల బావిలో దూకిన తిమ్మమ్మ శవమై తేలిందని!

ఊరి వాళ్ళ మొగాల్లో విచారం మోడాలు మాదిరిగా చిక్కగా కమ్ముకొన్నాయి. కన్నీటి వాన రాసాగింది.

అప్పటికే వచ్చిన ఆదిరెడ్డి అనమక్క విషయం తెలిసి కుమిలి కుమిలి ఏడుస్తూండిపోయారు.

"పుట్టే పసికందమ్మలన్నీ పోతాంటే, ఓ తిమ్మమ్మ (తిమ్మమ్మ మర్రిమాను) తల్లీ! నీకు మొక్కుకుంటే ఇది బతికె. మల్ల నా మొక్కుకింతే ఫలమా!" ఎద గుద్దుకొంది అనమక్క.

బెంగుళూరు నించి వచ్చిన బొజ్జిరెడ్డికి తిమ్మమ్మ పైని మట్టి రగ్గు కప్పించింది.

* * *

సంవత్సరాలు గడుస్తూన్నాయి. మంచి అదనులో పదునైన వానలు రాక పంటలు పండడం లేదు. రైతు బతుకు దిగపడి పోతూంది కాని ఎగబడి పోవడం లేదు.

అలివేలు బాగా ఎదిగింది. ఆదిరెడ్డికి బిడ్డ పెండ్లి గురించే చింత.

నీళ్ళకై బోరింగు దగ్గరకు వచ్చిన అలివేలును చూసి బోరింగు కొట్టే టప్పుడు మెత్తగా బరువుగా కదిలే ఆమె శరీరాన్ని చూస్తూ పెండ్లెప్పుడే కుచ్చుతా అడిగినారు.

అలివేలు చెంపలు సిగ్గుతో మెరిసినాయి.

"బొజ్జిరెడ్డిన్ని చేసుకో" ఎవరో అంటే అలివేలుకు కోపం వచ్చింది. కానీ ఏమీ అనలేదు.

* * *

నడిరాత్రి

"నక బిడ్డ సచ్చిపాయ, దీన్నీ ఆడే సాకి సంపేస్తావా?" అనమక్క అంది.

"మరి ఇంకేమి చేయల్ల? రాంగ రాంగ బతుకు బరువే మల్ల. బొజ్జిరెడ్డి ఇప్పుడు మడసంగా వుండాడు కదా!

ఒకాళ వాడు సొట్టగా తిరిగినా, అలివేలు గెట్టిది. తిమ్మమ్మా కట్ల కాదు. నిలబెట్టి అల్లాడిస్తూంది" అన్నాడు ఆదిరెడ్డి.

"ఊ అల్లాడిత్తుంది. ఏం జరిగినా సూస్తా వుండాల్సిందే. తిమ్మమ్మని ఏం జేస్తిమి. నీకు అత్తింట్లో రావిదుందే, రాయే మా కాడ అంటిమా? అదొచ్చి అంగలాసినా అదిలిస్తిమి గానీ దగ్గిర చేర్చుకొంటిమా?" అనమక్క కంఠంలో దుఃఖం పొంగింది.

"దాని రాత దానిది. దీనికీ ఆయా కట్లే వుంటారా? బొజ్జిరెడ్డి కిష్టమే. పైసా ఖర్చు లేకుండా అలివేలు బరువు దింపుకోవచ్చు."

మంచం మీద పడుకొన్నట్టుండీ, అంతా వింటూన్న అలివేలుకు దుఃఖం ముంచుకొచ్చింది.

నెల కింద అలివేలుకు ఒక సంబంధం వచ్చింది. ఆదిరెడ్డికి దూరం బంధువులు. వాళ్ళు పేద వాళ్ళైనా, ఆ సంబంధమే ఖాయమైతే బాగుందు కదాని బాధపడసాగింది అలివేలు.

తెల్లవారింది.

పొయ్యి ముందు కూచుని కాఫీ పెడ్తున్న అలివేలు 'బొజ్జిరెడ్డిని చేసుకో' అంటూ తల్లే నచ్చచెప్పడం చూసి లోలోన ఆశ్చర్యపోయింది.

పుట్టిల్లూ ఇరుకై పోయిందని అనుకొంది అలివేలు. అత్తిల్లూ, పుట్టిల్లూ ఇరుకైపోతే దిక్కులేని తిమ్మమ్మ ఎందుకు చచ్చిపోయిందో అలివేలుకు అర్థమైపోయింది. కానీ అలివేలు చావాలనుకోడం లేదు. ఎట్టయినా ఈ రెండు ఇరుకుల నుంచి బయట పడాలనే ఆలోచిస్తోంది. ●

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్